## క్లుప్తంగా

### శ్రీమఠం మేనేజర్‌గా శ్రీనివాసరావు



రాఘవేంద్రస్వామి సేవలో ఎస్కే శ్రీనివాసరావు

మంత్రాలయం : ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం మేనేజర్‌గా ఎస్కే శ్రీనివాసరావు మరోమారు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన వ్యక్తిగత సమస్యలతో మేనేజర్ పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేసిన విషయం విధితమే. ఆదివారం మేనేజర్‌గా మళ్లీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ దేవత మంచాలమ్మ, రాఘవేంద్రుల మూల బృందావనాలకు ప్రత్యేక పూజలు చేసుకున్నారు. మేనేజర్ చాంబర్ చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్-బి వెంకటేష్ జోషి, మేనేజర్-సి శ్రీపతి ఆచార్ ఆయనకు అభినందనలు తెలిపారు.

### ఆరోగ్యంపై అవగాహన

ఆదోని టౌన్: పట్టణంలోని శ్రీ కోట వెంకటేశ్వర దేవాలయంలో ఆరోగ్యభారతి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఆరోగ్యభారతి అభ్యాసక కార్యకర్తలకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ యం.డి.వి.ఎన్.రామశర్మ భగవాన్ శ్రీ ధన్వంతరి ప్రార్థనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆరోగ్యభారతి కర్నూలు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పి.మోక్షేశ్వరుడు, అఖిల భారతీయ సహ సంఘటనా కార్యదర్శి డాక్టర్ ఆర్.మురళీకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కుటుంబ వ్యవస్థపై, ఆరోగ్యంపై దినచర్యపై అవగాహన కల్పించారు. ఆదోనిలోని ప్రముఖ ప్రసూతి, స్త్రీ వ్యాధి నిపుణులు డాక్టర్ బి.మమత, ఆరోగ్యభారతి జిల్లా సహ కార్యదర్శి జగదీష్, సభ్యులు శ్రీనివాస్, మనోహరయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఉరుసు వేడుకలో ఎమ్మెల్యే



దర్గా సేవలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం : కర్ణాటకలోని రాజోలి గ్రామ మాల్‌ఖేడ్‌లో ఆదివారం హజరత్ సయ్యద్‌షా నేహమతుల్లా ఉరుసు జరిగింది. ఉరుసు ఉత్సవం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. దర్గాను పూలతో అలంకరించి పీఠాధిపతి సయ్యద్‌షా ముస్తాఫా ఖాద్రి ఆశీస్సులు పొందారు. ఆయనతోపాటు కోసిగి మండల కన్వీనర్ పి.మురళీమోహన్‌రెడ్డి ఉన్నారు.

### శ్మశాన వాటిక స్థలం పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో వివాదాస్పదంగా మారిన కర్నూలు రోడ్డులోని హిందూ శ్మశాన వాటిక స్థలంలో రోడ్డు నిర్మాణ ప్రాంతాన్ని ఆదివారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి పరిశీలించారు. శ్మశాన వాటికలో రోడ్డుకై స్థలాన్ని ఆక్రమించిన వారిని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. ఈనెల 6న 22 కులసంఘాల నాయకులతో సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. స్థలం ఆక్రమణ కాకుండా చర్యలు తీసుకుంటామని కులసంఘాల నాయకులకు హామీ ఇచ్చారు.

### వంట సామగ్రి వితరణ



వంట సామగ్రి అందజేస్తున్న లింగమూర్తి

నందవరం : మండల కేంద్రం నందవరంలో వెలసిన శ్రీమాతా బంగారమ్మవ్వ దేవాలయంలో ప్రతి అమావాస్యకు భక్తులకు అన్నదానం గావిస్తారు. అందకు గానూ అవసరమైన 40 కేజీలు, 30 కేజీల వంట పాత్రలను సరస్వతీ విద్యాపీఠం కరస్పాండెంట్ లింగమూర్తి దేవాలయ కార్యనిర్వహక పెద్దల సమక్షంలో అందజేశారు. ప్రతి అమావాస్యకు నిర్వహించే అన్నదాన కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగేంటే దాతలు ముందుకు వచ్చి సహాయ, సహకారాలు అందించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

### సూపర్ సిక్స్ అమలు చేసేదెప్పుడు?

ఎమ్మిగనూరుటౌన్: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల్లోని సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేసేదెన్నడోనని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి నాగరాజు, సత్యన్న ప్రశ్నించారు. ఆదివారం స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో డివిజన్ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకొని గద్దెనెక్కిన ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని సత్వరం అమలు చేయాలని లేనిచో ప్రజల వ్యతిరేకత చవిచూడాల్సి వస్తుందన్నారు.

# మళ్లీ ప'రేషన్'..!

- ఎండీయూ వాహనాల రద్దు
- రేషన్ షాపుల వద్దే సరుకుల పంపిణీ ప్రారంభించిన ప్రభుత్వం
- దుకాణాల వద్ద రేషన్ కోసం లబ్ధిదారుల పడిగాపులు
- బియ్యం మోసుకొని వెళ్లేందుకు కార్డుదారుల అవస్థలు



నందవరంలో షాపు-2లో రేషన్ కోసం వేచివున్న లబ్ధిదారులు

ఎమ్మిగనూరుటౌన్: కూటమి ప్రభుత్వం ఇంటివద్దకే బియ్యం పంపిణీ వ్యవస్థకు మంగళం పాడింది. ఆదివారం నుంచి రేషన్ షాపుల వద్దే సరుకుల పంపిణీని ప్రారంభించింది. దీంతో ఈనెల రేషన్ కోసం నియోజకవర్గంలోని రేషన్ షాపులకు ప్రజలు అష్టకష్టాలు పడుతూ వెళ్లి పడిగాపులు కాయాల్సి వచ్చింది. నియోజకవర్గ పరిధిలోని ఎమ్మిగనూరు మండలం,పట్టణంలో 86 రేషన్ షాపుల పరిధిలో 49,022 మందికి రేషన్ కార్డులున్నాయి. అదేవిధంగా గోనెగండ్ల మండలంలో 38 రేషన్ షాపుల్లో 23,385 రేషన్ కార్డులుండగా నందవరం మండలంలో 36 రేషన్ షాపులుండగా వాటి పరిధిలో 19,015 రేషన్ కార్డుదారులున్నారు. పట్టణంలోని కొన్ని రేషన్ షాపులు ఆదివారం ఉదయం 10.30గంటలైనా తెరవకపోవడంతో వాటి ముందు లబ్ధిదారులు డీలర్ కోసం వేచి చూడాల్సి వచ్చింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి నెల ఎండియూ వాహనాలు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వచ్చి సైరన్ మోగించి రేషన్ బియ్యం అందించింది. అయితే ఇందుకు భిన్నంగా కూటమి సర్కార్ మాత్రం మాజీ సీఎం వైఎస్ జగన్ మార్క్‌ను చెరిపేందుకు ఎండీయూ వాహనాలను రద్దు చేసి ప్రజలు రేషన్ షాపుల వద్దకు వచ్చి రేషన్ తీసుకెళ్లాలని హుకుం జారీ చేసింది. దీంతో మళ్లీ పాత కష్టాలు తమకు తప్పేలా లేవని లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**బియ్యం పంపిణీ చేసిన ఎమ్మెల్యే**

పట్టణంలోని 16వ వార్డులోని సున్నంబట్టి సమీపంలోని ఎఫ్‌పీఎస్ 33, ఎఫ్‌పీఎస్ 43 రేషన్ షాపులను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం సమీపంలో వున్న వృద్ధులైన లబ్ధిదారుల ఇళ్లకు తహసీల్దార్ శేషఫణితో కలిసి వెళ్లి బియ్యం పంపిణీ చేశారు.

**మోరాయించిన సర్వర్**

ఎమ్మిగనూరురూరల్: ప్రభుత్వం కార్డుదారులకు నిత్యవసర సరుకులు రేషన్ దుకాణాల దగ్గర సరఫరా చేయటం ఆదివారం నుంచి మొదలు కావటంతో కార్డుదారులు అవస్థలు పడ్డారు. కార్డుదారులు బియ్యం కోసం పనులు వదులుకొని రేషన్ షాప్ దగ్గర పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆదివారం మండలంలోని 40 రేషన్ దుకాణాల్లో కార్డుదారులకు నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమం అధికారులు చేపట్టారు. అయితే కార్డుదారులు వేలిముద్ర వేసిన వెంటనే సర్వర్ ఎర్రర్ అని వస్తుండటంతో డీలర్లు, కార్డుదారులు చాలా సమయం వరకు వేచివుండాల్సి వచ్చింది. కొంత మంది కార్డుదారులు వేచి ఉండే ఓపిక లేక మరో రోజు బియ్యం తీసుకోవచ్చునని వెళ్లిపోయారు. మొదటి రోజు కాబట్టి సర్వర్ సమస్య ఉంటుందని, సోమవారం నుంచి ఏ సమస్య ఉండదని రెవిన్యూ అధికారులు చెపుతున్నారు.

**రేషన్ కోసం పడిగాపులు**

గోనెగండ్ల : రేషన్‌షాపుల వద్ద కార్డుదారులు రేషన్ పొందెందుకు మళ్లీ పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఆదివారం మండలంలోని అన్ని రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీని అధికారులు, డీలర్లు ప్రారంభించారు. రేషన్ బియ్యం పొందేందుకు కార్డుదారులు షాపులకు వెళ్లి వేచి ఉన్నారు.

> **కార్డుదారుల కష్టాలు**
>
> నందవరం: మండలంలో 36 రేషన్ దుకాణాలు, 19,015 రేషన్ కార్డులు ఉన్నాయి. ఆదివారం మండలంలో దాదాపు 30 షాపులు మాత్రమే ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటల తర్వాత అన్ని షాపులను ప్రారంభించారు. అయితే సర్వర్ సమస్యతో డీలర్లు తలలుపట్టుకున్నారు. సర్వర్ సతాయింపుతో అటు డీలర్లు, ఇటు కార్డుదారులు అవస్థలు పడ్డారు. గంటల తరబడి పడిగాపులు కాచి వేచ్చి ఉండవల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆన్‌లైన్ రిపోర్టు ప్రకారం మధ్యాహ్నం 12 గంటల వరకు 6.13 శాతం మాత్రమే రేషన్ పంపిణీ జరిగింది. కేవలం మండలంలో 1,301 కార్డులకు మాత్రమే రేషన్ పంపిణీ చేశారు. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఆందోళన చెందారు. కూలీ పనులు మానుకొన్ని రేషన్ తీసుకోవాలిసి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

చాటా చోట్ల సర్వర్ మోరయించడంతో షాపుల దగ్గర కార్డుదారులు గంటల కొద్దీ పడిగాపులు కాయాల్సి వచ్చింది. మొదటి రోజే సర్వార్ మోరాయిస్తే మునుమ్ముందు ఇంకా ఎన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందోనని కార్డుదారులు విమర్శిస్తున్నారు. కొందరికీ రేషన్ షాపులు దూరం కావడంతో రేషన్ సరుకులు తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. బైకులు, సైకిళ్లలో వెళ్లి సరుకులను తెచ్చుకున్నారు.

**వృద్ధులకు తప్పని మోత**

మంత్రాలయం రూరల్ : కూటమి ప్రభుత్వ పుణ్యమా అని పేదల కష్టాలు మొదటి వచ్చాయి. డీలర్ షాపులతో పడిగాపులు.. క్యూలైన్లలో నిరీక్షణలకు బాటలు వేసింది. ఎండీయూ వాహనాలు తొలగించి ప్రభుత్వ నియంతృత్వ వైఖరిని చాటుకుంది. రేషన్ కష్టాలను చేరువజేసి కన్నీళ్లు తెప్పిస్తోంది. సీనియర్ సిటిజన్స్‌కు ఇంటివద్దకే రేషన్ అని డప్పు కొట్టిన ప్రభుత్వం మొదటి రోజు వృద్ధుల నెత్తిన మోత పెట్టింది. మంత్రాలయం మండలంలో మొత్తం 36 రేషన్ దుకాణాలు కలవు. ఉదయం ఆయా రేషన్ దుకాణాల్లో ప్రభుత్వం సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. మండల కేంద్రంలో చౌకదుకాణం-3లో సర్వర్ లేకపోవడంతో పేదలు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. వృద్ధులకు ఇంటి వద్దే రేషన్ ఇవ్వాలని నిబంధన ఉన్నా ఏ డీలర్ వృద్ధుల ఇంటికి వెళ్లి రేషన్ ఇచ్చిన దాఖలాలు లేకపోయాయి. చాలా మంది వృద్ధులు దుకాణాలతోనే సరుకులు తీసుకుని వెళ్లారు. ఇంటింటికి రేషన్ విధానానికి స్వస్తి పలకడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి.

**సర్వర్ సతాయింపు**

కోసిగి: మండలంలో రేషన్ షాపుల వద్ద ఆదివారం రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. మండలంలోని 42 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఇందులో 22,150 రేషన్ కార్డులు ఉండగా 75,764 క్వింటాళ్ల బియ్యం కోటా కేటాయించారు. లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు 27 రెగ్యులర్ షాపులు, 15 ఇన్‌చార్జ్ డీలర్లతో రేషన్ పంపిణీ ప్రక్రియ చేపట్టారు. మొదటి రోజు కావడంతో లబ్ధిదారులు రేషన్ షాపుల వద్దకు చేరుకున్నారు. సర్వర్ సమస్య ఉండడంతో రేషన్ షాపు పడిగాపులు కాయాల్సి వచ్చింది. పనులు మానుకుని వేచి ఉండాల్సి వస్తోందని కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గోనెగండ్లలో తలపై బియ్యం మూట ఎత్తుకొని వెళ్తున్న మహిళ



గోనెగండ్లలో బైకుపై రేషన్ తీసుకెళ్తున్న దృశ్యం



కోసిగిలో రేషన్ షాపు వద్ద సర్వర్ సమస్యతో వేచి ఉన్న లబ్ధిదారులు



మంత్రాలయంలో డీలర్ షాపులో వేలిముద్ర వేస్తున్న వృద్ధులు

> **తప్పని ఆగచాట్లు**
>
> ఆదోని టౌన్: ఆదోని నియోజకవర్గంలో జూన్ 1వ తేదీ నుంచి రేషన్ సరుకులను రేషన్‌షాపుల వద్దనే అందించేలా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో రేషన్‌షాపుల ముందు రేషన్ సరుకుల కోసం ఖాళీ సంచులు, రేషన్ కార్డులు చేతబూని క్యూలో నిలిచారు. గంటల తరబడి నిల్చొన్నా సరుకులు అందని పరిస్థితి నెలకొంది. దీంతో లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా మహిళలు, చంటిబిడ్డలతో తల్లులు అవస్థలు పడ్డారు. రేషన్‌షాపుల వద్ద గంటల తరబడి నిల్చొనే పరిస్థితిపై పునరాలోచించాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. రేషన్ వాహనాలను యథావిధిగా కొనసాగించాలని, తద్వారా ప్రజలకు వెంటనే సరుకులు పొంది కూలీ, ఇతరత్రా పనులకు వెళ్తూ ఉపాధి పొందే అవకాశం లభిస్తుందని చెబుతున్నారు.

## రాష్ట్రంలో కూటమి అరాచక పాలన



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, నాయకులు

మంత్రాలయం : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అరాచక పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆరోపించారు. ఆదివారం స్వగ్రామం రాంపురంలో 'వెన్నుపోటు దినం' పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్‌బాబు రెడ్‌బుక్ రాజ్యాంగంతో రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితులను తలపిస్తున్నాయన్నారు. ముఖ్యంగా మోసపూరిత హామీలతో గతేడాది జూన్4వ తేదీన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సూపర్ సిక్స్ పేరుతో రాష్ట్ర ప్రజలను నిలువునా దగా చేసిందన్నారు. కేవలం వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్ చేసుకుని పాలన సాగించడం తప్ప రాష్ట్ర ప్రజలకు చేసింది శూన్యమని విమర్శించారు. 143 రకాల హామీలను గుప్పించిన కూటమి ప్రభుత్వం పట్టుమని 10 హామీలు కూడా నెరవేర్చలేదన్నారు. సూపర్ సిక్స్‌లో కేవలం పింఛన్లు, గ్యాస్ సిలిండర్ హామీలతో ఏడాది పూర్తి చేసుకున్నారన్నారు. ప్రజలను బురిడీ కొట్టించిన చంద్రబాబుకు నైతికత లేదని ఆరోపించారు. తన అసమర్థ పాలన నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులపై లేనిపోని కేసులు వేయించి కాలయాపన చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

**4న ఆందోళన**

చంద్రబాబు వెన్నుపోటు విధానాన్ని నిరసిస్తూ ఈనెల 4వ తేదీన మంత్రాలయం నియోజకవర్గ కేంద్రంలో ఆందోళన చేపతున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. స్థానిక అబోడె హోటల్ నుంచి ర్యాలీగా బయలుదేరి రెవెన్యూ కార్యాలయం చేరుకుని ధర్నా చేస్తున్నట్లు వివరించారు. పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆందోళనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండల కన్వీనర్ జి.భీమారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంరెడ్డి, మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, కోసిగి మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్‌రెడ్డి, కోసిగి మండల కన్వీనర్ బెట్టనగౌడ్, పెద్దకడబూరు మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 4న వెన్నుపోటు దినం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోవడం, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాలయాపన చేస్తున్న టీడీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 4వ తేదీన వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో కాలయాపన జరుగుతోందన్నారు., నేడు, రేపు, మాపు అంటూ ఏడాది కావొస్తున్నా ఒక్క పథకం కూడా అమలు చేయలేకపోవడం విచారకరమన్నారు. రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి రావడం చంద్రబాబు నాయుడికి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఫ్రీ బస్, తల్లికి వందనం, విద్యాదీవెన, అన్నదాత సుఖీభవ తదితర పథకాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్న చంద్రబాబు సర్కారుకు వ్యతిరేకంగా వెన్నుపోటు దినాన్ని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం వెన్నుపోటు దినం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చంద్రకాంత్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు, మాజీ మున్సిపల్ చైర్మన్ దేవదాస్, ప్రచార కార్యదర్శి నారాయణ, కౌన్సిలర్లు చలపతి, మధు, గోవిందు, ఉస్మాన్, పట్టణాధ్యక్షుడు దేవా, యూత్ అధ్యక్షుడు నల్లారెడ్డి, అశోక్, పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పెద్దహరివాణంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయండి**

ఆదోని రూరల్: ఈనెల 4న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరిగే వెన్నుపోటు దినం ర్యాలీ, ఆందోళన కార్యక్రమాలు దిగ్విజయం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మీసేవా నాగరాజు స్వగృహంలో గ్రామ నాయకులు ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడారు. 4వ తేదీన ఆదోని పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే సాయి స్వగృహం ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి పెద్దహరివాణం గ్రామం నుంచి పెద్ద ఎత్తున తరలి వెళ్దామని తీర్మానించారు. కార్యక్రమానికి ఎలా వెళ్లాలి, ఎంతమందితో వెళ్దామన్న విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీరేష్, సీనియర్ నాయకులు మెడికల్ నాగరాజు, మీసేవ నాగరాజు, వైస్ సర్పంచ్ మల్లికార్జునరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, డీలర్ మారెప్ప, గర్జప్ప, లింగన్న, బి.పి.బలరాం తదితరులు పాల్గొన్నారు.

### రేషన్ పంపిణీ ప్రారంభం

ఆదోని రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో ధర్మేంద్రకు చెందిన 62వ రేషన్‌షాపులో ఆదివారం రేషన్ సరుకుల పంపిణీని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పౌర సరఫరాలశాఖ ద్వారా నిత్యావసర సరుకులు చేసే కార్యక్రమంలో ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం ప్రతి ఎఫ్‌పీ షాపులో క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీని ద్వారా ప్రజలు తమ అభిప్రాయాన్ని నేరుగా ప్రభుత్వానికి తెలియజేయవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాముడు, పౌర సరఫరాలశాఖ ఉప తహసీల్దార్ వలీబాషా, రీసర్వే శాఖ ఉప తహసీల్దార్ పెద్దయ్య, ఆయాశాఖల అధికారులు ఉన్నారు.

**షాపుల వద్దే రేషన్ పంపిణీ**

కౌతాళం: రేషన్‌షాపుల వద్దే రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం తహసీల్దారు రజినీకాంత్‌రెడ్డి ఉరుకుంద ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ చెన్నబసప్పతో కలిసి ప్రారంభించారు.



రేషన్ సరుకులను అందజేస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

**రేషన్ సక్రమంగా పంపిణీ చేయండి**

నందవరం : ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు నిత్యావసర సరుకులను డీలర్లు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశించారు. ఆదివారం మండల పరిధిలోని ముగతి గ్రామంలో షాపు నెంబర్-24లో రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం మాచాపురం, ఇబ్రహీంపురం, కొట్టాల, నదికూరవాడి, గంగవరం, జోహరాపురం, పెద్దకొత్తిలి, నాగలదిన్నె గ్రామాలలోని రేషన్ దుకాణాలను తనిఖీ చేపట్టారు.

### నూతన హెచ్‌ఎంలకు సన్మానం



హెచ్‌ఎంలను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

ఆదోని సెంట్రల్: పట్టణంలో పదోన్నతులు పొంది పాఠశాలల్లో నూతనంగా చేరుతున్న హెచ్‌ఎంలను ఆదివారం ఎస్టీయూ నాయకులు సన్మానించారు. హస్మియా ఉర్దూ పురపాలక ఉన్నత పాఠశాలకు హెచ్‌ఎంగా నూర్‌బాషా, నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలకు హెచ్‌ఎంగా ఎస్.ఫయాజిద్దీన్, ఆర్ఆర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలకు హెచ్‌ఎంగా రవి, కల్లుబావి పురపాలక ఉన్నత పాఠశాలకు హెచ్‌ఎంగా కె.గిరిబాబు, కిలిచినపేట పురపాలక ఉన్నత పాఠశాలకు హెచ్‌ఎంగా బి.ఉరుకుందప్ప బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో ఎస్టీయూ సంఘం నాయకులు సుధాకర్‌బాబు, ప్రహ్లాద, లోక్యనాయక్, రాజాసతీష్, ప్రసాద్, రమేష్‌నాయుడు, ఖలీల్, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

**హెచ్‌ఎంకు సత్కారం**

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా డి.గోవిందు పదోన్నతిపై వచ్చి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన ఆయనను పాఠశాల ఉపాధ్యాయులు రాజారాంమోహన్, సిద్ధలింగమూర్తి, శ్రీనివాసులు, వేణుగోపాల్, మహబుబ్‌ఖాన్, నాగరాజులతో పాటు పలువురు ఉపాధ్యాయులు శాలువా, పూలమాలతో సత్కరించారు. పాఠశాలలో విద్యాభివృద్ధికి అందరు కలిసి పని చేయాలని ఆయన సూచించారు.

**కోసిగి హైస్కూల్ హెచ్‌ఎంగా శ్రీనివాసులు**

కోసిగి: కోసిగి బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా శ్రీనివాసులు ఆదివారం పాఠశాలలో బాధ్యతలు చేపట్టారు. ఆయన కర్నూలు మిలటరీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తు గ్రేడ్-2 హెచ్‌ఎంగా పదోన్నతి పై కోసిగి పాఠశాలకు వచ్చారు. ఇక్కగా పనిచేస్తున్న ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఖలీల్ అహ్మద్ ఆయనకు బాధ్యతలకు అప్పగించారు. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు జోసెఫ్, లక్ష్మయ్యలు ఉన్నారు.

## అమలు కాని టీడీపీ హామీలు



వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయినప్పటికీ ఒక పింఛన్ పెంచడం తప్ప ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని వైఎస్సార్‌సీపీ వీరశైవలింగాయత్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రుద్రగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, ఎంపీపీ కేశన్న అన్నారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఆవరణలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంపై జున్ 4న నిర్వహించే వెన్నుపోటు దినం పోస్టర్లను పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామంటూ అబద్ధపు హామీలతో గద్దెనెక్కిందన్నారు. ఏడాదైనా సూపర్ సిక్స్ పథకాలు ఎక్కడ అని ప్రశ్నించారు. అదే మాజీ సీఎం వైఎస్ జగనన్న అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పథకాల క్యాలెండర్ ఆవిష్కరించి, ఆ మేరకు ఏడాదిలోగా అన్ని సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అందించి దేశంలో ఆదర్శంగా నిలిచారన్నారు. అధికారంలోని వచ్చిన వెంటనే సంక్షేమ పథకాలు అందించకుంటే తమ కాలర్ పట్టుకోమన్న మంత్రి నారాలోకేష్ ఎక్కడున్నారని ప్రశ్నించారు. జూన్ నాలుగవ తేదీన నిర్వహించే వెన్నుపోటు దినంలో భాగంగా పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ నుంచి ర్యాలీగా బయలు దేరి రెవెన్యూ కార్యాలయంకు వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి యూకే రాజశేఖర్, టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బీఎస్ నాగరాజు, కౌన్సిలర్లు డిష్‌కేశవరెడ్డి, వెంకటాపురం బజారి, రాజు, పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు కోటకొండ నరసింహులు, బజారిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

### నేడు యోగా పోటీలు

కౌతాళం: మండలస్థాయి యోగా పోటీలను సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయశేఖర్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈపోటీలను నిర్వహిస్తామన్నారు. ఈనెల 21 వరకు ప్రతి రోజు మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామస్థాయిలో ప్రజలకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

**టీబీ క్యాంపెయిన్**

మండల కేంద్రమైన కౌతాళంలో టీబీ క్యాపెయిన్ సోమవారం ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ పాల్‌దినకర్ తెలిపారు. ఎస్సీ కాలనీలోని పీహెచ్‌సీ సెంటర్ బసవన్నగుడి వద్ద ప్రభుత్వ వైద్యశాఖ ఆధ్వర్యంలో ఈ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య పరీక్షలు, ఎక్స్‌రేలు ఉచితంగా చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు.

### పొట్టేళ్లు వెరీ కాస్ట్

ఎమ్మిగనూరుటౌన్: ముస్లింలు బక్రీద్ పండుగను ఈనెల 7వ తేదీన జరుపుకొనుండటంతో పట్టణంలోని మేకల మార్కెట్ ఆదివారం పొట్టేళ్ల విక్రయదారులు, కొనుగోలు దారులతో కిటకిటలాడింది. పండుగకు సమయం దగ్గరపడటంతో వ్యాపారులు, రైతులు పొట్టేళ్లను అధిక సంఖ్యలో అమ్మకాలకు తీసుకొని వచ్చారు. ఒక్కో పొట్టేలు రూ.48 వేలు, రూ.20వేల వరకు విక్రయించారు. ఎప్పుడూ లేని విధంగా ఈ సారి మాత్రం పొట్టేళ్ల ధరలు పెంచి విక్రయించడంతో కొనుగోలు దారులు వామ్మో ఇంత ధరలా అని పెదవి విరిస్తున్నారు. పండుగకు ముందుగా ఆదివారం సంత రావడంతో ధరలు పెంచి విక్రయిస్తున్నారని ఆరోపిస్తున్నారు.



మార్కెట్‌లో రూ.48వేలకు విక్రయిస్తున్న పొట్టేళ్లు

### అ'పూర్వ' సమ్మేళనం

ఆదోని సెంట్రల్: పట్టణంలోని వైఎంకే హైస్కూల్‌లో 1995–96 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాలలో జరిగింది. 30 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని వీరసేన, నాగరాజు అధ్యక్షన చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రధానోపాధ్యాయులు నాగరాజు, రత్నం, ఉపాధ్యాయులు మల్లికార్జున, ఎల్లప్ప, ఉమాశంకర్, ప్రతాప్, ఈరలింగప్ప, ఈశ్వరయ్య హాజరయ్యారు.



నాటి ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులతో పూర్వపు విద్యార్థులు